

# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

**వీరు నాకు ఎలా** మిత్రులయ్యారో, నాకు ఎలాంటి సహాయాలు చేశారో చెప్తాను. శ్రీ జయదేవరెడ్డిగారు, నేను రేడియోలో స్క్రిప్టు రైటర్‌గా పనిచేస్తున్న రోజుల్లోనే పరిచయమై, నన్ను టి.వి.రంగానికి పరిచయం చేసి, టీవీ రచయితగా నాకు ప్రభుత్వం నుంచి నాలుగు 'నంది'లు రావటానికి పరోక్షంగా కారకులయ్యారు.

ఇక ఆదివిష్ణుగారి గురించి చెప్పాలంటే చాలా వుంటుంది. నన్ను వెతుక్కుంటూ ఆకాశవాణికి వచ్చి కలుసుకున్నారు. ఆయన ప్రముఖ సినీరచయితగా మీ అందరికీ తెలిసే ఉంటుంది. నా చేయి పట్టుకుని ఆయన వెళ్ళిన నిర్మాతలందరి దగ్గరకూ నన్ను వెంటబెట్టుకుని వెళ్ళేవారు. ఆ విధంగా సినిమాకు (ఎన్నోకాదులెండి) నేను మాటల రచయితగా, కథా రచయితగా పరిచయమై కొద్దో గొప్పో గుర్తింపు తెచ్చుకున్నాను.

నేను 1988లో ప్రమోషన్ పైన కడప వెళ్ళినప్పుడు కుటుంబాన్ని హైదరాబాద్‌లోనే వుంచి పదిహేను రోజులకూ, నెలరోజులకూ ఒసారి కడపనుంచి వచ్చి రెండుమూడురోజులు కుటుంబంతో గడిపి వెడుతుండేవాణ్ణి. ఆ సమయంలో శ్రీ జయదేవిరెడ్డిగారు ఏదో తమ స్వంత పనిమీద ఢిల్లీ వెళ్ళినప్పుడు ఆకాశవాణి భవన్‌లో ఉద్యోగం చేసుకుంటున్న ఆయన మిత్రుణ్ణి కలిసి, నా గురించి చెప్పి "ఎలాగైనా మా రామచంద్రమూర్తిగార్ని హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ చేయాలండీ" అని కోరారు.

అలా రెడ్డిగారు కోరిన రెండు నెలలకే నన్ను తిరిగి హైదరాబాద్‌కి బదిలీ చేశారు. కడపలో ఏడాది కూడా పనిచేయకుండా తిరిగి హైదరాబాద్ వచ్చిన నన్ను అందరూ అభినందించారు. నిజానికి ఆ అభినందనలు శ్రీ రెడ్డిగారికి చెందాలనుకుంటాను. కాదంటారా?'

శ్రీ ఆదివిష్ణుగారు చేసిన సహాయం కూడా మీకది చిన్నదిగానే అనిపించవచ్చు. కానీ ఆ రోజుల్లో నాకది ఎంతో ఘనమైన సహాయమని నేననుకుంటాను.

మా ఆకాశవాణిలో నా సహోద్యోగి ఒకరు, తమ మిత్రుడు ఏదో చిట్‌ఫండ్ కంపెనీ నుంచి లోను తీసుకుంటూ 'సెక్యూరిటీ' సంతకాల కోసం ఆయన్ని అభ్యర్ధించాడు. ఆయన ఒక సంతకం చేసి రెండో 'సెక్యూరిటీ'గా నన్ను సంతకం చేయమని అడిగారు. తోటి మిత్రులు అడిగితే కాదనలేక నేను ష్యూరిటీ సంతకం పెట్టాను. ఇదంతా జరిగింది 1978లో అనుకుంటాను. సరే. సంతకం పెట్టాను కదా. అలా పెట్టిన అయిదో నెలలో నాకు మా ఆఫీసువాళ్ళు జీతం ఇవ్వలేదు.

నేను వెంటనే ఎకౌంటెంట్ దగ్గరకు వెళ్ళి అడిగాను. అప్పుడాయన ఓ చిట్‌ఫండ్ కంపెనీ మీ జీతానికి "ఎటాచ్‌మెంట్ పెట్టిందండీ. వెంటనే ఆ విషయం చూసుకోండి. లేకపోతే వచ్చేనెల జీతం కూడా రాదు" అని చెప్పాడు. నాకు మతిపోయినంత పనైంది. వెంటనే నాతో ష్యూరిటీ సంతకం చేయించుకున్న నా సహోద్యోగిని కలిసి విషయం చెప్పాను. ఆయన ఆశ్చర్యపోయారు. అప్పట్లో 'సెల్‌ఫోన్స్' లేవు కదా. ల్యాండ్‌లైన్ ఫోన్ కనెక్షన్లే అంతంత మాత్రంగా వుండేవి. అప్పుడాయన ఆ సాయంత్రమే తన మిత్రుణ్ణి కలిసి "ఇలా ఎందుకు జరిగింది?" అని అడిగారట. దానికి అతను ఆ చిట్‌ఫండ్ కంపెనీ నుంచి తీసుకున్న అప్పు తాలూకు ఇన్‌స్టాల్‌మెంట్స్

నాలుగు నెలలుగా బాకీ వున్నట్టూ వారం పదిరోజుల్లో ఆ బాకీ తీర్చేయబోతున్నట్టు సమాధానం ఇచ్చాడట. నా సహోద్యోగి తెల్లమొహం వేసుకుని నా దగ్గరకొచ్చి "ఒక్కవారం ఓపిక పట్టండి మూర్తిగారూ. నేను సెటిల్ చేస్తాను" అన్నారు.

ఎలా ఓపిక పట్టటం? ముందు ఇంటి అద్దె అయిదువందలు అర్జంటుగా కట్టాలి. పాల చీటీలు కొనాలి. ఏం చేయాలో పాలుపోలేదు. అప్పుఅడగాలన్నా నాకు ఎవరితోనూ పరిచయాలు లేవు. అనుకోకుండా ఆ సాయంత్రం శ్రీ ఆదివిష్ణు మా రేడియో స్టేషన్‌కి వచ్చారు. మాటల సందర్భంలో జరిగిన విషయం యావత్తూ యథాలాపంగానే ఆయనకు చెప్పాను. ఒక్క నిమిషం ఆలస్యం చేయకుండా, ఆలోచించకుండా "మరేం ఫర్వాలేదు మూర్తిగారూ! నాకు ఇవాళే జీతం వచ్చింది. నేనిస్తాను. తీసుకోండి. మీ జీతం చేతికి అందాక నాకు ఇవ్వండి" అంటూ పర్సు తీసి ఎనిమిది వంద కాగితాలు నా చేతిలో పెట్టి "చాలా ఇంకో రెండు వందలు ఇమ్మంటారా?" అని అడిగారు.

తర్వాత పదిహేను రోజులకు చిట్‌ఫండ్ కంపెనీలో ఆ వ్యక్తి లావాదేవీలు పూర్తిచేసుకుని నా జీతం నాకు ఇవ్వటం, వెంటనే ఆదివిష్ణుగారి బాకీ తీర్చటం జరిగిపోయాయనుకోండి. అది వేరే విషయం. కానీ ఆ సమయంలో శ్రీ ఆదివిష్ణు చేసిన సహాయం గురించి మీరేమంటారు?

అసలు ఆదివిష్ణుగారితో పరిచయభాగ్యం చాలా విచిత్రంగా కలిగింది.

అది 1977వ సంవత్సరం. ఓ రోజు నేను ఆకాశవాణి కార్యాలయంలో నా సీటులో కూర్చుని ఏదో స్క్రిప్టు రాసుకుంటున్నాను. అంతలో "ఇక్కడ జీడిగుంట రామచంద్రమూర్తిగారు ఎవరండయ్యా?" అనే మాట వినిపించి వెనక్కి తిరిగి గుమ్మం వైపు చూశాను. ఆయన గొంతు అచ్చం రావుగోపాలరావుగారి గొంతులా ధ్వనించింది. కానీ ఆయన కాదులెండి. కొంచెం నల్లగా, మరికొంచెం బొద్దుగా, ఇంకొంచెం ముద్దుగా వున్న వ్యక్తి అక్కడ కనిపించారు. "నేనే రండి కూర్చోండి" అంటూ నా ఎదురుగా వున్న సీటు చూపించాను.

ఆయనగారు కుర్చీలో కూర్చుని "నా పేరు ఆదివిష్ణు అంటార య్యా. కథలూ కాకరకాయలూ రాస్తుంటాను. మా స్వగ్రామం బందరనుకోండి. కానీ విజయవాడ ఆర్టీసీలో గత పదిరోజుల క్రితందాకా పనిచేశాను. ఈ మధ్యనే ఇక్కడకు బదిలీ అయివచ్చాను. మిమ్మల్ని కలవమని నా మిత్రులు ఎర్రంశెట్టి శాయి, వేదగిరి రాంబాబూ చెప్పారు" అంటూ తనను తాను పరిచయం చేసుకున్నారు.

నాకు ఆశ్చర్యమూ ఆనందమూ కూడా కలిగాయి. అప్పట్లో ఆంధ్రపత్రికవారు ఎప్పుడు కథల పోటీ నిర్వహించినా నేను కథలు పంపుతుండేవాణ్ణి. కానీ ఎప్పుడూ ఆ పోటీలో ఆదివిష్ణుగారు రాసిన కథలకే బహుమతులు రావటం నాకు తెలుసు. నా కథలు మాత్రం సాధారణ ప్రచురణకు స్వీకరించబడేవి. ఆ విధంగా నాకు ఆదివిష్ణుగారి పేరుతో పరిచయం వుంది. ఇపుడు స్వయంగా ఆయనే నన్ను వెతుక్కుంటూ రావటం ఆశ్చర్యమే కదా.

ఆ మాటా ఈ మాటా అయ్యాక అసలు మాట చెప్పారాయన. కార్మికుల కార్యక్రమంలో సంభాషణలు చాలా హాస్యభరితంగా వుంటాయనీ, వాటిని రాస్తూ బాలయ్యగా నేను పాల్గొంటున్న విషయం ఆయనకు తెలిసిందనీ, అందుకే నన్ను కలిసి, అభినందించటానికి వచ్చాననీ అన్నారు. అంత గొప్ప హాస్య రచయిత నేను రాసిన హాస్యాన్ని మెచ్చుకోవటం నాకెంతో సంతోషం కలిగించింది. అదే మాటల సందర్భంలో ఆయన విజయవాడ రేడియో స్టేషన్ నాటక విభాగానికి చాలా నాటకాలు రాసిన సంగతి చెప్పారు. తన నివాసం హైదరాబాద్‌కి మారిన నేపథ్యంలో ఇకముందు ఈ విభాగానికే నాటకాలు రాయాల్సి వస్తుందని చెప్పారు.

"అయితే రాయండి. వచ్చే నెలలో రేడియో నాటక వారోత్సవాలు జరగబోతున్నాయి. అందులో ప్రసారం చేస్తాం" అని చెప్పి, ఆయన్ని వెంటనే ఆ విభాగాన్ని చూస్తున్న చౌదరిగారికి పరిచయం చేశాను. ఆయన కూడా ఆదివిష్ణుగార్ని కలిసినందుకు తమ ఆనందాన్ని వ్యక్తం చేసి, రేడియో నాటక సప్తాహంలో ప్రసారం చేయటానికి హాస్యనాటకం రాసివ్వమని అడిగారు.

వారం రోజుల్లో 'సింహాచల యాత్ర" పేరుతో ఓ హాస్య నాటకం రాసి పట్టుకొచ్చారు శ్రీ ఆదివిష్ణు. అందులో ప్రధాన పాత్రను కోట శ్రీనివాసరావుగారు డ్రామా ఆర్టిస్టుగా మా 'పేనల్'లో లేరు. ఎలా? అందుకని వెంటనే ఆయన కోసం ప్రత్యేకంగా ఆడిషన్ నిర్వహించి, 'బి' గ్రేడ్ ఆర్టిస్టుగా ఎంపిక చేసుకుని, ఆయనతోనే ఆ నాటకాన్ని రికార్డు చేసి ప్రసారం చేశాం.

ఆ విధంగా ప్రారంభమైన ఆదివిష్ణుతో పరిచయం ఎందో దృఢపడి వారానికి రెండుసార్లయినా కలవకుండా కబుర్లు చెప్పుకోకుండా ఉండలేని పరిస్థితికి వచ్చాం. సాయంత్రాల సమయంలో ఆయన మా రేడియో స్టేషన్‌కి రావటం అక్కడినుంచి మాకు ఎదురుగా వున్న పబ్లిక్ గార్డెన్స్‌కి వెళ్ళటం అక్కడ మేం ఇద్దరం అప్పట్లో రాసిన కథల గురించి చర్చించుకోవటం జరుగుతూ వుండేది. నేను రాసిన కథల గురించి ఆయనకు చెప్పినప్పుడు "చాలా బావుంది గురూజీ" అని మెచ్చుకునేవారు. ఆ మెచ్చుకోలే నాలో ఉత్సాహాన్ని నింపేది.

మొత్తానికి ఆయన్ని కలిసిన వేళా విశేషం ఏమిటోగానీ నాటినుంచీ మేమిద్దరం ఒక్కరమైపోయాం. ఇద్దరం మా పదవులనుంచి రిటైర్ అయిపోయినా గత రెండు మూడేళ్ళవరకూ అడపా దడపా కలుస్తూనే వున్నాం. ఇటీవల వృద్ధాప్యపు సమస్యలవల్ల ఆయన బయటకు రావటం తగ్గించిన కారణంగా కలవలేకపోతున్నాం. త్వరలోనే ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

ఇంతకీ ఇక్కడ చెప్పవచ్చేదేమిటంటే ఇదా లోకం, కన్నెవయసు, అహ! నా పెళ్ళంట, ప్రేమలేఖలు మొదలైన సినిమాలకు స్క్రీన్‌ప్లే సంభాషణలు రాసిన ఆయనకు సినీరంగ ప్రముఖులతో విశేషమైన పరిచయం వుండేది. ఆ సందర్భంగా అప్పట్లో ఆయన మదరాసు వెడుతుండేవారు. వెంట నన్ను కూడా తమతో తీసుకెళ్ళేవారు. చివరకు అందరూ 'ఆదివిష్ణు ఎక్కడుంటే అక్కడ వుండును' అనే ఆలోచనకు వచ్చేశారు. (ఇప్పుడు మా కలయిక తగ్గిపోయిందనుకోండి) అదలావుంటే ఆదివిష్ణుగారికి జంధ్యాలతో చాలా గాఢమైన పరిచయం ఉండేది. జంధ్యాలగారు మదరాసునుంచి షూటింగ్ నిమిత్తం హైదరాబాద్‌కి ఎప్పుడొచ్చినా ముందుగా ఆదివిష్ణుగారికి కబురు అందేది. సాయంత్ర సమయాల్లో ఆయన్ని కలుసుకునేందుకు వెళ్ళే ఆదివిష్ణు నన్ను కూడా తమ వెంట తీసుకుపోయేవారు. ముగ్గురం కలిసి సినిమా కబుర్లు చెప్పుకునేవాళ్ళం. ఆ విధంగా జంధ్యాలగారు కూడా నాకు ఆప్తమిత్రులయ్యారు. నాకూ ఆదివిష్ణుకీ కలిపి జంధ్యాలగారు 'ఆది - గుంట' కవులు అని నామకరణం చేశారు.

ఆదివిష్ణు, జంధ్యాలగార్లను గురించి ప్రస్తావించినపుడు శ్రీ బ్రహ్మానందంగారి గురించి కూడా నా జ్ఞాపకాల్ని మీతో పంచుకోవాలని అనిపిస్తోంది.

అది 1986వ సంవత్సరం. ఓ రోజు ఉదయం నేను ఆకాశవాణి కార్యాలయంలో అడుగుపెట్టేసరికి ఇద్దరు యువకులు నాకోసం ఎదురుచూస్తూ వున్నారు. నన్ను చూడగానే ఒకతను నమస్కారం పెట్టి తన పేరు చెప్పుకున్నాడు. తర్వాత తర్వాత తన పక్కన వున్న మరో అతన్ని చూపించి "ఈయన పేరు బ్రహ్మానందం అండి. అత్తిలి కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు" అని పరిచయం చేశాడు.

'అత్తిలి' పేరు చెప్పగానే ఆకర్షితుణ్ణయ్యాను. ఎందుకంటే మా అత్తవారి గ్రామం బల్లిపాడు వెళ్ళాలంటే అత్తిలి రైల్వే స్టేషన్లో దిగి అక్కణ్ణించి జట్కాబండిలో గానీ మా బావమరిది పంపించే సైకిలుమీదనో వెళ్ళాల్సి వచ్చేది. ఆ ఆకర్షణే వారిద్దరినీ లోపలకు ఆహ్వానింపచేసింది. పక్కనే వున్న క్యాంటిన్లో ముగ్గురం కాఫీలు తాగాం.

అప్పుడు ఆ మొదటి యువకుడు శ్రీ బ్రహ్మానందం గురించి చెప్పాడు. "ఈయన నాకు బావగారు అవుతారండి. మిమిక్రీ బ్రహ్మాండంగా చేస్తారు. వెస్ట్ గోదావరి జిల్లాలో చాలా కార్యక్రమాలు చేశారు. మీరు రేడియోలో అవకాశం ఇస్తే అలా అయినా శ్రోతలు చాలామంది వినగలుగుతారని మీకు పరిచయం చేద్దామని తీసుకొచ్చాను."

"మా జిల్లావాడు, మా అత్తగారి ఊరిపక్కనే ఉన్నవాడు అవకాశం ఇస్తే ఏం పోతుంది? ప్రతిభావంతుల్ని పరిచయం చేయటంలో తప్పులేదుగా?" అనుకుని ఆయన్ని స్టూడియోలోకి తీసుకెళ్ళాను. మా స్టాఫ్ ఆర్టిస్టులైన శ్రీమతి శారదా శ్రీనివాసన్‌గార్నీ, శ్యామలాదేవిగార్నీ, మరో ఇద్దరు ఇంజనీరింగ్ సహాయకుల్నీ కూర్చోపెట్టి వారి సమక్షంలో శ్రీ బ్రహ్మానందంగారిని మిమిక్రీ చేయమన్నాను. ఆయన అదరగొట్టేశారు. కూర్చుని చూస్తున్న మా సిబ్బంది మిత్రులు చప్పట్లు కొట్టారు. ఆయన చేసిన 'మిమిక్రీ' అంశాన్ని ఉదయ తరంగిణి కార్యక్రమంలో 'హాస్యవల్లరి' పేరుతో నాలుగు వారాలు ప్రసారం చేశాను.

అక్కడితో అయిపోలేదు. దాదాపు అదే సమయంలో 1985లో నా రచనా వ్యాసంగ రజతోత్సవం చేసిన మయూర సంస్థవారు 1996లో శ్రీ ఆదివిష్ణుగారి రచనా జీవిత రజతోత్సవం చేసిన మయూర సంస్థవారు 1996లో శ్రీ ఆదివిష్ణుగారి రచనా జీవిత రజతోత్సవం చేశారు. అప్పుడు శ్రీ బ్రహ్మానందంగారి మిమిక్రీ కూడా ఏర్పాటు చేశాం. ఆ కార్యక్రమానికి నా మిత్రుడు ఆదివిష్ణుగారికికూడా సన్నిహితుడైన దూరదర్శన్ కళాకారుడు శ్రీ ఎమ్వీవీ శశిధర్ కూడా వచ్చాడు. శ్రీ బ్రహ్మానందంగారి మిమిక్రీ చూసి, ముచ్చటపడి దూరదర్శన్‌కి ఆహ్వానించి ఆయనతో 'పకపకలు' శీర్షికన కొన్ని మిమిక్రీ ఐటమ్స్ రికార్డు చేసి వారానికి నాలుగుసార్లయినా వాటిని ప్రసారం చేశాడు.

ఆ విధంగా ప్రేక్షకులకు బాగా దగ్గరయిపోయారు శ్రీ బ్రహ్మానందం. సరిగ్గా అప్పట్లోనే శ్రీ జంధ్యాలగారు హైదరాబాద్ ఓ సినిమా షూటింగ్ నిమిత్తం రావటం ఆయనకు శ్రీ ఆదివిష్ణు, శ్రీ బ్రహ్మానందంగారిని పరిచయం చేయటం ఆయన ముందు శ్రీ బ్రహ్మానందం మిమిక్రీ ఐటమ్స్ చేసి చూపించటం జరిగిపోయాయి. శ్రీ జంధ్యాలగారికి బ్రహ్మానందంగారు దగ్గరైపోయారు. అప్పట్లో ఆయన నిర్మించతలపెట్టిన 'సత్యాగ్రహం సినిమాలో వేషం ఇస్తాను' రమ్మన్నారు. అంతకుముందే శ్రీ ఆదివిష్ణుగారు రచించగా శ్రీ వేజెండ్ల సత్యనారాయణగారు దర్శకత్వం వహించిన 'తాతావతారం' సినిమాలో కూడా శ్రీ బ్రహ్మానందంగారికి అవకాశం వచ్చింది. అంతకుముందే శ్రీ బ్రహ్మానందంగారికి శ్రీ ఎ. కోదండరామిరెడ్డిగారు దర్శకత్వం వహించి శ్రీ చిరంజీవి హీరోగా నటించిన 'పసివాడి ప్రాణం' చిత్రంలో చిన్న పాత్ర పోషించే అవకాశం లభించింది.

అయితే శ్రీ ఆదివిష్ణు రచించగా శ్రీ జంధ్యాల దర్శకత్వం వహించిన "అహ నా పెళ్ళంట" సినిమాలో వేషం దొరకటం, ముందుగా అదే సినిమా రిలీజు కావటం జరిగిపోయాయి. అందులో శ్రీ బ్రహ్మానందం వేసిన వేషం బాగా పేలింది. ఇక తిరుగే లేకుండా ఎన్నో సినిమాల్లో వేషాలు ఆయన్ని వెతుక్కుంటూ వచ్చాయి. ఇంతకీ ఇక్కడ నేను చెప్పదల్చుకున్న సంగతి ఏమిటంటే శ్రీ బ్రహ్మానందంగారి సినీ ప్రవేశానికి తొలి అడుగు ఆకాశవాణిలోనే పడిందని.

అన్నట్టు ఇక్కడ ఇంకో విషయం కూడా గుర్తుకు వస్తోంది. అప్పట్లో జంధ్యాలగారికి ఇంకా సంతానం కలగలేదు పిల్లలంటే ఆయనకు మహా ఇష్టం. నాకు మనుమడు పుట్టాడని తెలుసుకున్న ఆయన వాడిని చూడటం కోసం ఒకటి రెండుసార్లు మా ఇంటికి వచ్చారు. ఆ తర్వాత ఆయన మదరాసు నుంచి వచ్చి మా ఇంటికి దగ్గర్లో వున్న గోల్కొండ హోటల్లో బసచేసినపుడు మా ఇంట్లో తయారు చేసిన ప్రత్యేక వంటకాల్ని వారికోసం నేను తీసుకువెళ్ళిన సందర్భాలు కూడా కొన్ని లేకపోలేదు. అలాంటప్పుడూ జంధ్యాలగారు "మీరు వచ్చేటప్పుడు మీ మనవణ్ణి కూడా తీసుకురండీ జీడిగుంటగారూ" అంటుండేవారు. నేను మా మనవణ్ణి వెంట తీసుకువెళితే వాడికి ఆయన ప్రత్యేకించి ఐస్‌క్రీమ్ తెప్పించి పెట్టేవారు. ఇవన్నీ నాకు తీపి జ్ఞాపకాలే. అన్నట్టూ నా మనవడు మీలో చాలామందికి ఆ తర్వాత తెలిసినవాడే అతనే 'హ్యాపీడేస్' హీరో వరుణ్ సందేశ్. ఒకనాడెప్పుడో జంధ్యాలగారు ఎంతో ప్రేమతో వాడిని ఎత్తుకోవటం వల్లనే ఆయన చేతిస్పర్శ మా మనవణ్ణి హీరోని చేసిందేమో అనిపిస్తుంది. అయితే మావాడు హీరో కావటానికి ముందుగానే జంధ్యాలగారు కన్నుమూయటం తల్చుకుంటే బాధ కలుగుతుంది.

సరే మళ్ళీ ఆదివిష్ణుగారి జోలికి వస్తాను. ఆయనతో బాగా పరిచయం ముదిరిపోయాక మరో మాయాబజార్, అమృతకలశం, పెళ్ళిళ్ళోయ్ పెళ్ళిళ్ళు మొదలైన సినిమాలకు ఆయన సంభాషణలు రాస్తూ నన్ను సహాయకునిగా తీసుకున్నారు. అపుడే 'తాతా-మనవడు' సినిమా తీసిన నిర్మాత ప్రతాప్ ఆర్ట్స్ రాఘవగారు ఆదివిష్ణుగారిని పిలిచి 'ఈ ప్రశ్నకు బదులేది?' సినిమాకు సంభాషణలు రాయమన్నారు. అయితే ఆయన ఆఫీసు పని వత్తుడులతో 'బిజీ'గా వున్న కారణంచేత రాఘవగారికి నన్ను పరిచయం చేసి "ఈయన కూడా నా బాణీలోనే రాస్తాడండీ' అంటూ అప్పగించారు. అలా ఆ సినిమాకు సంభాషణల రచయితగా సినీరంగానికి పరిచయం అయ్యాను.

అయితే సినిమా రచయితగా నాకు మరో అవకాశం కూడా వచ్చినంత పనైంది. కానీ ప్రాప్తం లేకుండా పోయింది. అదెలా పోయిందో చెప్తాను.

1978లో మదరాసులో వుండే ప్రముఖ చిత్ర నిర్మాత శ్రీ విజయబాపినీడుగారు నన్ను మదరాసు రమ్మని ఆహ్వానించారు. అప్పటికే ఆయన 'విజయ' అనే మాసపత్రికను నడుపుతూండటం, ఆ పత్రికకు నేను అడపాదడపా కథలు రాస్తూండటం జరిగింది. ఆ పరిచయంతోనే నాకు అలా వారినుంచి పిలుపు వచ్చింది.

నేను హైదరాబాద్‌నుంచి బయల్దేరి మదరాసు చేరుకున్నాను. నన్ను 'రిసీవ్' చేసుకునేందుకు ప్రముఖ మేకప్‌మాన్ శ్రీ మాధవరావుగారు వచ్చారు. నాతోబాటు వేరే రైళ్ళలో వచ్చిన శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం, శ్రీ రామాచంద్రమౌళి, శ్రీ ఎర్రంశెట్టి సాయి, శ్రీ మల్లాది వెంకటకృష్ణమూర్తిలను కూడా ఆయన రిసీవ్ చేసుకున్నారు. మా అయిదుగుర్నీ ఆంధ్రా క్లబ్‌కి తీసుకువెళ్ళి అక్కడవున్న గెస్ట్‌హౌసుల్లో బస ఏర్పాటు చేశారు. ఆ రోజు విశ్రాంతి తీసుకుని మర్నాడు శ్రీ మాధవరావుగారు మమ్మల్ని జెమినీ స్టూడియో (ఇప్పుడు అది లేదనుకుంటాను)కి తీసుకెళ్ళి అక్కడున్న విజయబాపినీడు గారికి పరిచయం చేశారు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments